జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు నాగరత్నమ్మ. ఈమెది హిందూపురం మండలం బేవినహళ్లి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈమె కుటుంబానికి రూ.5,26,608 లబ్ధి చేకూరింది. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.56,250, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.48,000, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.27,182, వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.82,000, అమ్మఒడి, అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇళ్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ పంటల బీమా ద్వారా లబ్ధి పొందారు. జగనన్న ప్రభుత్వంలో రూ.5 లక్షల దాకా లబ్ధి పొందానని నాగరత్నమ్మ హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు రాజప్పగారి జయమ్మ. వీరిది గోరంట్ల మండలం దేవుల చెరువు గ్రామం. గడచిన మూడున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వివిధ పథకాల ద్వారా ఈమె కుటుంబానికి రూ.1,30,269 లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.17వేలు, పింఛన్ కింద రూ.35 వేలు, వైఎస్సార్ సున్నవడ్డీ ద్వారా రూ.3,827 , చేయూత పథకం ద్వారా రూ. 37,500, రైతు భరోసా ద్వారా రూ.40,500 లబ్ధి పొందారు. జగనన్న ప్రభుత్వంలో మాలాంటి నిరుపేదలకు అన్ని విధాలా భరోసా లభిస్తోందని జయమ్మ కొనియాడారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు హనుమక్క. వీరిది మడకశిర మండలం బుళ్లసముద్రం గ్రామం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.4,710, వైఎస్సార్ ఆసరా రూ.18,088, వైఎస్సార్ చేయూత రూ.37,500, పింఛన్ కానుక రూ.82,000 చొప్పున మొత్తం రూ.1,42,278 లబ్ధి పొందారు. ఇంతలా పేదలకు లబ్ధి చేకూరుస్తున్న ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదని హనుమక్క తెలిపారు. మళ్లీ సీఎం వైఎస్ జగనన్నకు అండగా నిలుస్తూ రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకొంటామని పేర్కొన్నారు.



గోరంట్ల: దేవుల చెరువులో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర నారాయణ



మడకశిరరూరల్: బుళ్లసముద్రంలో సంక్షేమ లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



హిందూపురం: సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

- మళ్లీ ఆయనకే మద్దతిస్తాం
- అన్ని విధాలా ఆదుకుంటున్నారని లబ్ధిదారుల హర్షం

గోరంట్ల: కుల, మత, రాజకీయలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వడిగేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దేవులచెరువు, పులగూర్లపల్లి, బుడ్డపల్లి గ్రామాల్లో సర్పంచ్, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, మాజీ సర్పంచ్ సుశీలబాయి, పార్టీ ముఖ్యనేతల నేతృత్వంలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు.

169 మందికి పాసుపుస్తకాల పంపిణీ..

ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని, సమస్యలను సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవులచెరువు గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థినులకు ఆయన శుభకాంక్షలు తెలిపారు. అలాగే దేవుల చెరువు రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులకు జగనన్న శాశ్వత, భూహక్కు - భూరక్షపథకం ద్వారా మంజూరు చేసిన పట్టా పాసు పుస్తకాలను 169 మంది రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర పాటూరి శంకరరెడ్డి, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బాషా, గోరంట్ల మార్కెట్ యార్డు అధ్యక్ష , ఉపాధ్యక్షులు బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, నూర్‌మహమ్మద్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, బూదిలి, వానవోలు సహకార సంఘాల అధ్యక్షులు రఘురామిరెడ్డి, రాజేంద్రప్రసాద్, నాయకులు మైలారప్ప, శంకరనాయక్, శంకర్, నాగభూషణరెడ్డి, ప్రకాష్ రెడ్డి, రామమాంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: అర్హతే ప్రమాణికంగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుంది. ఆయనకే మళ్లీ మా ఆశీర్వాదం ఉంటుందని లబ్ధిదారులు, మహిళలు పేర్కొన్నారు. మండల పరిధిలోని బుళ్లసముద్రం గ్రామ సచివాలయం పరిధిలోని బుళ్లసముద్రం గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరించండి..

ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ జగనన్న ఆధ్వర్యంలో ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. గ్రామంలో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు కిందకు ఉన్నాయని వెంటనే సరిచేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, సర్పంచ్ రంగమ్మ, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, మూర్తి, కార్పొరేషన్ డైరెక్టర్లు నాగరాజు, అనిత, రైతు సంఘం నాయకుడు రామిరెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, మండల, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు మంజునాథ్, జమ్మానిపల్లి మూర్తి, నాయకులు తిప్పేనరసప్ప, తిప్పన్న, హనుమంతరాజు, సుధాకర్, నటరాజు, రంగస్వామి, గంగప్ప, రంగనాథ్, నాగేంద్రయాదవ్,వేణు ప్రకాష్, సత్యనారాయణ, గోపి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: ప్రజాసంకల్ప పాదయాత్రలో పేదలకు ఇచ్చిన మాట ప్రకారం 95 శాతానికిపైగా హామీలను అమలు చేసిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బేవినహళ్లిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్సీ వివరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఒక్క బేవినహళ్లి గ్రామంలోనే రూ.7,12,38,950 ఇప్పటి వరకూ అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, రాజకీయ పార్టీ, వర్గాలు చూడకుండా సంక్షేమ పథకాల ద్వారా అందించినట్లు పేర్కొన్నారు.

అన్నీ అసత్య ప్రచారాలే..

రాష్ట్రంలో పేదల కోసం ఏ మంచి పని తలపెట్టినా జీర్ణించుకోలేని ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు ఆ పథకాలపై అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్సీ ఇక్బాల్ విమర్శించారు. ప్రజలంతా జగనన్నకు అండగా ఉండాలని కోరారు. ప్రజలు గ్రామంలో ఉన్న డ్రైనేజీ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, ఇప్పటికే తాము డ్రైనేజీ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. 35 ఏళ్లుగా హిందూపురంలో ఒకే పార్టీకే ప్రాతినిధ్యం కట్టబెట్టడంతోనే ఇలాంటి పరిస్థితులు ఏర్పాడ్డాయన్నారు. ఎమ్మెల్యేగా ప్రజల ఓట్లతో గెలిచిన బాలకృష్ణకు హిందూపురం ప్రజలు గుర్తున్నారా? అని ప్రశ్నించారు. కనీసం ఆ పార్టీ నాయకులైనా దీనికి సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద్, జెడ్పీటీసీ నాగభూషనం, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లేష్, వైస్ సర్పంచ్ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ నరేంద్ర, ఈఓఆర్డీ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



పరిగి: అంతర్జాతీయ బాలికల దినోత్సవంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



హిందూపురం: చౌళూరు జెడ్పీ హైస్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

హిందూపురం: బాలికలు విద్య, ఆరోగ్యం, సామాజికపరంగా అన్ని అంశాల్లో ఎదగాలని వైఎస్సార్ సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి, చౌళూరు జ్యోత్స్నారెడ్డి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని చౌళూరు జెడ్పీ హైస్కూల్‌లో బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికలతో కలిసి కేక్‌కట్ చేసి అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాలికలు, మహిళ సామాజిక భద్రత కోసం దిశ లాంటి యాప్ ఏర్పాటు చేసిందని అండగా నిలుస్తోందన్నారు. సీఎం జగనన్న అన్నిరంగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌తో అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

జాతీయ బాలికల దినోత్సావాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆఫీసు వద్ద ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డి రమణమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. అనంతరం ఆడపిల్లలను రక్షిద్దాం చదవనిద్దామన్న నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.

పరిగిలో...

పరిగి: సమాజంలో స్త్రీ పాత్ర ఎంతో గౌరవప్రదంగా కీర్తింపబడుతోందని, ప్రధానంగా బాలికల సంరక్షణ మనందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత తెలిపారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని మండలంలోని కొడిగెనహళ్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

మడకశిరలో...

మడకశిర: బాలికలు చదువులో రాణించి ఉన్నతంగా ఎదగాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి సూచించారు. మంగళవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. మరోవైపు పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో కూడా హెచ్‌ఎం గణేష్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు.

చిలమత్తూరులో...

చిలమత్తూరు: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ, దేమకేతేపల్లి సర్పంచ్ తిరుమలేష్ అన్నారు. గాడ్రాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమాజంలో వివక్షకు తావు లేదని, బాలురుతో పాటుగా బాలికలకూ సమాన హక్కులు ప్రభుత్వాలు కల్పించాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెనుకొండలో...

పెనుకొండ రూరల్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీఓ శాంతలక్ష్మి సూచించారు. వెంకటగిరి పాళ్యం, యర్రమంచి, మునిమగడుగు గ్రామాల్లో పాఠశాలల్లో మంగళవారం బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ పలు సూచనలు, సలహాలిచ్చారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



మడకశిరరూరల్: జ్యోతులతో మహిళా భక్తులు



పావగడ: ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయిలో వెలిసిన చౌడేశ్వరిదేవికి మహిళలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జ్యోతులను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మెళవాయి గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

పావగడ: తాలూకాలోని న్యాయదగుంటె గ్రామంలో వెలసిన కొల్లాపురమ్మకు హారతి వేడుకను మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు హారతి జ్యోతులతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. కొల్లాపురమ్మ జాతర బుధవారం ముగియనున్నట్లు ధర్మకర్త ఎస్ ఈరణ్ణ తెలిపారు.

గూర్ఖా కుటుంబానికి ఆర్థికసాయం

సోమందేపల్లి: గత ఇరవై ఏళ్లుగా మండల కేంద్రమైన సోమందేపల్లిలో గూర్ఖాగా పనిచేస్తున్న ప్రేమ్ ఆంటోనీ (60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. అంత్యక్రియలకు కూడా స్తోమత లేక అతని కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న వివేకానందనగర్ కాలనీ వాసులు స్పందించి రూ.24,500, అలాగే సత్యసాయి సేవా సమితి ద్వారా రూ.5 వేలను బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

'సేంద్రియం'తో అధిక దిగుబడి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ వీరనరేష్

మడకశిరరూరల్: మండలంలో రబీలో బోరు బావుల కింద పంటలు సాగు చేసిన రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని ఏఓ వీరనరేష్ తెలిపారు. మెళవాయి రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతు నాగరాజు పొలంలో మంగళవారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న డీవైఈఓ రంగస్వామి

గుడిబండ: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని డీవైఈఓ రంగస్వామి తెలపారు. మంగళవారం మండల పరిధిలోని మోరుబాగల్ ఉన్నత పాఠశాలలను డీవైఈఓ తన బృందంతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే వివిధ రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట ఎంఈఓ శ్రీధర్ ఉన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. బుళ్లసముద్రంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి వైద్య సిబ్బందితో కలిసి పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డివిజన్ మలేరియా అధికారి కోదండరామిరెడ్డి, కార్యదర్శి మారుతీప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లేపాక్షి: మండల పరిధిలోని గొంగటిపల్లి బస్టాండు వద్ద మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో హిందూపురం నుంచి చిలమత్తూరు వైపు వెళ్తున్న సోమందేపల్లి మండలం మణేసముద్రంకు చెందిన నాగరాజు, చిలమత్తూరు నుంచి లేపాక్షి వైపు వెళ్తున్న చిలమత్తూరు మండలం చేనేపల్లికి చెందిన చంద్రశేఖర్ గాయపడగా హిందూపురం ఆస్పత్రికి తరలించారు. ఇరువురు మద్యం మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

రొళ్లలో యువకుడు...

రొళ్ల: మండల పరిధిలోని వన్నారనపల్లి క్రాస్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంజునాథ్ అనే యుడకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అగళి నుంచి ద్విచక్ర వాహనంలో వన్నారనపల్లికి వస్తుండగా క్రాస్ వద్ద కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే 108 వాహనంలో మంజునాథ్‌ను హిందుపురం ఆస్పత్రికి తరలించారు.

రైతు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

మడకశిర: మడకశిరలో మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అఖిల పక్ష నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఈరౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సమస్యలపై నాయకులు చర్చించారు.

26 నుంచి పక్కాగా ప్లాస్టిక్ నిషేధం

లేపాక్షి: ఈనెల 26 నుంచి మండల వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తామని తహసీల్దార్ బాబు తెలిపారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ బ్యానర్లు తయారు చేయడం, అమ్మడం, రవాణా చేయడం, ప్రింట్ చేయడం, ఉపయోగించడం, ప్రదర్శించడం నిషేధమన్నారు.

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్ల వినియోగంపై నిషేధం విధిస్తున్నట్లు తహసీల్దార్ ఆనంద కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మడకశిర (అగళి): అగళి మండలంలోని ఇరిగేపల్లి గొల్లహట్టిలో బుధవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేంద్ర తెలిపారు.

కోనాపురంలో...

పెనుకొండ రూరల్: మండలంలోని కోనాపురంలో బుధవారం మధ్యాహ్నం 1 గంటకు ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగశూరు బాబు పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

అమరాపురం: మండలంలోని వలస గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఉపాధి పథకం కింద జరగుతున్న పనులను మంగళవారం ఎంపీడీఓ మునిస్వామి పరిశీలించారు. కూలీలందరూ పనులకు వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు కృషిచేయాలన్నారు.

రీ సర్వే పూర్తి

సోమందేపల్లి: జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన కొత్తపల్లిలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం ద్వారా చేపడుతున్న రీ సర్వే మంగళవారంతో పూర్తయినట్లు ఈఓఆర్డీ నాగరాజురావు తెలిపారు. గృహాలు, గ్రామకంతం, రోడ్లు తదితర ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను డ్రోన్ ద్వారా సర్వే చేశామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి కృష్ణ ప్రసాద్, సర్వేయర్లు వాణి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రారంభ ఉత్సవాలు



ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా కలశ పూజ చేసిన దృశ్యం

హిందూపురం: పట్టణంలోని త్యాగరాజనగర్‌లో నూతనంగా నిర్మించిన ఉమానర్మదేశ్వరుల ఆలయ ప్రారంభోత్సవ అంకుర్పాణ కార్యక్రమాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా గణపతిపూజ, యాగశాల ప్రవేశం, కలశస్థాపన తదితర పూజలు చేశారు. 25న కలశార్చన, హోమాలు, నిర్వహిస్తామని, 26న గర్భాలయంలో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ నిర్వహిస్తామన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

సోమందేపల్లి: మండలంలోని రంగేపల్లి వద్ద మంగళవారం సాయంత్రం గోనె సంచిలో తరలిస్తున్న 40 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. నంజుండప్ప అనే వ్యక్తి నుంచి అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరచి రిమాండ్‌కు తరలించామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

హిందూపురం టౌన్: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పనిచేస్తున్న కొల్లప్ప ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ప్రైవేటు స్కూల్ అసోసియేషన్, ఎంఆర్‌సీ పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, పలువురు ఉపాధ్యాయులు బాధిత కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం ఎంఈఓ గంగప్ప సమక్షంలో ఎంఈఓ కార్యాలయంలో ఆర్థిక సహాయాన్ని మృతుడి కుమారుడికి అందజేశారు.


సౌత్ జోన్ పోటీలకు ఎంపిక



సాయిలతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న జి.సాయిలత సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి తెలిపారు. కర్ణాటకలోని మైసూర్ యూనివర్సిటీలో జరిగే క్రికెట్ పోటీల్లో ఎస్కేయూనివర్సిటీ తరపున పాల్గొననున్నట్లు చెప్పారు. అధ్యాపకులు, విద్యార్థులు సాయిలతను అభినందించారు.

చిత్రలేఖనం పోటీలో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని హర్షిత

హిందూపురం: జిల్లా కేంద్రీయ విద్యాలయ సీబీఎస్‌ఈ మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో హిందూపురం వివేకానంద మిలీనియం స్కూల్ విద్యార్థిని హర్షిత ప్రతిభ చాటినట్లు ఆ కళాశాల కరెస్పాండెంట్ బైసాని రాంప్రసాద్ తెలిపారు. అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరచి ప్రథమ బహుమతితో పాటు ప్రధాని మోదీ ఆటోగ్రాఫ్‌తో కూడిన పుస్తకం అందుకున్నట్లు చెప్పారు.

ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం



రక్తదాతలకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘం, హెల్పింగ్ హార్ట్స్ సంయుక్తంగా తలసీమియా బాధితుల కోసం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తరలివచ్చి రక్తదానం చేశారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ చేతుల మీదుగా రక్తదాతలకు, సామాజిక సేవకులకు సేవా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు.

నేడు చింత ఫలసాయం వేలం

రొళ్ల: మండల పరిధిలోని రంగనపల్లిలోని చింతతోపునకు బుధవారం దొడ్డేరి సచివాలయంలో ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ క్రిష్టప్ప తెలిపారు.

ఏకాగ్రతతో రాణించాలి

హిందూపురం: ఏకాగ్రతతో విద్యలో రాణించి లక్ష్యాన్ని చేరుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని, ఇతర వ్యామోహాలు, అలవాట్లకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య అన్నారు. సెబ్ పోలీసులు మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రగతి అధ్యక్షతన మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకూడదని హితవు పలికారు. సెబ్ ఎస్‌ఐ పోతులయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఆత్మ బలిదానం'



అలంకరణలో కన్యకా పరమేశ్వరి

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోటలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కన్యకా పరమేశ్వరి ఆత్మ బలిదానం, విశ్వ రూప యజ్ఞ మహోత్సవ వేడుకలను స్థానిక ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 102 మంది కన్యకల కలశోత్సవంతో పాటు యాగశాల ప్రవేశం నిర్వహించారు.

అక్రమ లేఅవుట్ల తొలగింపునకు చర్యలు



అక్రమ లేఔట్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ బాలజీ

మడకశిరరూరల్: మండలంలో పంచాయతీ అనుమతి లేకుండా పంచాయతీల్లో వేసిన అక్రమ లేఅవుట్ల తొలగింపుకు చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ బాలజీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన ఈఓఆర్డీ శైలజ, గ్రామ కార్యదర్శులతో కలిసి హరేసముద్రం పంచాయతీలోని అక్రమ లేఅవుట్లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరియన్న, ఈఓఆర్డీ శైలజ తదితరులు పాల్గొన్నారు.